క్లుప్తంగా

యోగాంధ్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు అన్నారు. మండల స్థాయి అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమ నిర్వహణకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.వీలైనంత ఎక్కువ మందితో యోగా చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ అప్పలసూరి, ఎంఈవోలు సత్యనారాయణ, రామన్న పాల్గొన్నారు.

బోరు ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్,స్థానికులు

గూడెంకొత్తవీధి: పూజరిపాకలలో గల బోడ కొండ సాంబార్ దేవి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం బోరును ఏర్పాటు చేస్తున్నారు. సర్పంచ్ సుభద్ర, ఉప సర్పంచ్ రాంబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించి, బోరు ఏర్పాటు పనులను ప్రారంభించారు.

పాల్‌రాజ్ సేవలు చిరస్మరణీయం



పాల్‌రాజ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాలేజీ యాజమాన్య ప్రతినిధులు

ఎటపాక: మాజీ ఎమ్మెల్యే,డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ సతీష్ పాల్‌రాజ్ ఏజెన్సీకి చేసిన సేవలు చిరస్మరణీయమని కళాశాల కార్యదర్శి వి.రాజశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేష్ తెలిపారు. పాల్‌రాజ్ 15వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఎటపాకలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ పాల్‌రాజ్ ఏజెన్సీలో విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేశారని చెప్పారు. ఈకార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ హదీరాం,అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం



దొంగలు తొలగించిన ట్రాన్స్‌ఫార్మర్

డుంబ్రిగుడ: మండలంలోని కించు మండలో గురువారం అర్ధ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భాగాలను తొలగించి, తరలించేందుకు సిద్ధమవుతున్న సమయంలో స్థానికులు రావడంతో వారు పరారయ్యారు. స్థానిక సర్పంచ్ చెల్లమ్మ విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ట్రాన్స్‌ఫార్మర్ పార్టులను తొలగించడంతో కించుమండలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

జింక్ సల్ఫేట్, వేపపిండి సిద్ధం



రాజవొమ్మంగి పీఏసీఎస్‌లో ఉన్న జింక్, వేప పిండి బస్తాలు

రాజవొమ్మంగి: రైతులకు పంపిణీ చేసేందుకు జింక్ సల్ఫేట్ కిట్లు, వేపపిండి బస్తాలు సిద్ధంగా ఉన్నాయని స్థానిక పీఏసీఎస్ సీఈవో గోపాలకృష్ణ తెలిపారు. జింక్ పది కిలోల కిట్ ధర రూ.1,000, వేపపిండి 50 కిలోల ధర రూ.1,050 అని తెలిపారు. 1,500 కిట్ల జింక్ సల్ఫేట్, 300 బస్తాల వేపపిండి అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రచారం

రోలుగుంట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం సీఆర్పీలు, ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. కొండపాలెం, శరభవరం, జె.నాయుడుపాలెం, బుచ్చింపేట, వడ్డిపలో శుక్రవారం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న పథకాలపై అవగాహన కల్పించారు.

సిమ్ ఏదైనా.. సమస్య సేమ్

సెల్ సిగ్నల్స్ అందక అవస్థలు

ప్రభుత్వ సేవలకు అంతరాయం

గంగవరం : బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేట్ నెట్‌వర్క్ కంపెనీల సేవలకు తరచూ అంతరాయం కలుగుతుండడంతో గంగవరం మండల ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. దాదాపు అన్ని సంస్థలు టవర్లు ఏర్పాటు చేసినా సిగ్నల్స్ సరిగా అందడం లేదని మండల వాసులు వాపోతున్నారు. ఎవరితోనైనా మాట్లాడాలన్నా, వాట్సప్‌లో ఏదైనా సమాచారం చేరవేయాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలకు తరచూ విఘాతం కలుగుతోంది. మండలంలోని పలు ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. అయినా పూర్తి స్థాయిలో గిరిజన గ్రామాలకు సేవలు అందడం లేదు. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సెల్ టవర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరాలో ఏ చిన్న అంతరాయ కలిగినా సెల్ టవర్ల పని చేయడం లేదు. గతంలో గంగవరం, కొత్తాడ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ఏర్పాటు చేయగా చాలా మంది వినియోగదారులు ఆ సంస్థ సిమ్ కార్డులు తీసుకున్నారు. మొదటిలో నెట్ వర్క్ సమస్య పెద్దగా ఉండేది కాదు. కొన్ని రోజుల తరువాత సిగ్నల్ సమస్య ఏర్పడింది. ఇదే సమయంలో కొత్తగా జియో టవర్లను గంగవరం, కొత్తాడ, నెల్లిపూడి ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. దీంతో బీఎస్ఎన్ఎల్ నుంచి చాలా మంది జియోకి **మారిపోయారు. జియో సిగ్నల్స్ కూడా సరిగా అందకపోవడంతో వినియోగదారులకు అవస్థలు తప్పలేదు. ఇటీవల మారుమూల గిరిజన గ్రామాల్లోను** ఎయిర్‌టెల్ సంస్థ టవర్లు ఏర్పాటు చేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎయిర్‌టెల్ సిమ్‌లు తీసుకున్నారు. అయినా ప్రయోజనం లేకపోయింది. మొల్లేరులో ఎయిర్‌టెల్ టవర్ సక్రమంగా పనిచేయడం లేదని ఆ పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత సిబ్బందిని అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదని వారు చెప్పారు. ప్రభుత్వ పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని , సిగ్నల్స్ సరిగా అందక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నభోజన పథకం, పిల్లల ఆధార్ నమోదులో తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అధికారులు స్పందించిన సమస్యను పరిష్కరించాలని సమస్యను పరిష్కరించాలని వినియోగదార్లు కోరుతున్నారు.



మొల్లేరులో సక్రమంగా పనిచేయని సెల్ టవర్

సక్రమంగా అందని బీఎస్ఎన్ఎల్ సేవలు



కొత్తాడలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఒక రోజు పనిచేస్తే రెండు రోజులు పనిచేయడం లేదు. బీఎస్ఎన్ఎల్ సేవలు సక్రమంగా అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

– చవలం సంకురు దొర, మాజీ సర్పంచ్, కొత్తాడ

బిల్ కట్టే వరకూ పనిచేస్తున్నాయి..



మొల్లేరు గ్రామంలో బిల్లు కట్టేవరకు ఎయిర్‌టెల్ సిగ్నల్స్ వస్తున్నాయి. తరువాత నుంచి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. టవర్లు ఏర్పాటు చేసిన సమయంలో చాలా మంది ఎయిర్‌టెల్‌కు మారారు. ఇప్పుడు సిగ్నల్స్ సరిగా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురతున్నారు.

–కొటికలపూడి రామ తులసి, మొల్లేరు

దీక్షలకు ప్రజా ప్రతినిధుల మద్దతు



నినాదాలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు, జేఏసీ నాయకులు

చింతూరు: ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం ఎంపీపీ సవలం అమలతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధనకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి రాజకీయాలకతీతంగా అందరూ మద్దతు పలకాలని, డీఎస్సీ నుంచి ఏజెన్సీ టీచర్ పోస్టులు మినహాయించి స్థానిక ఆదివాసీలతో వాటిని భర్తీచేయాలని వారు కోరారు. ఎన్నికల ముందు జీవో నంబర్ 3పై చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సున్నం నాగరాజు, సర్పంచ్‌లు సవలం సత్తిబాబు, అగరం సుబ్బలక్ష్మి, కొవ్వాసి రామారావు, వేకా ప్రసాద్, సత్యకుమారి, జేఏసీ మండల కార్యదర్శి కాక సీతారామయ్య, తుర్రం అశోక్, పొడియం రామకృష్ణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు పీసా కమిటీ ఎన్నిక



శివరామకృష్ణకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచ్

గంగవరం : పలు మార్లు వాయిదా పడుతూ వచ్చిన గంగవరం పీసా గ్రామకమిటీ ఎన్నిక ఎట్టకేలకు శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఉపాధ్యక్షుడిగా పి.శివరామకృష్ణ దొర (చిట్టి) , కార్యదర్శిగా పిల్లా చిన్నిబాబులను సర్పంచ్ కలుముల అక్కమ్మ , తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, ఎంపీడీవో వై.లక్ష్మణరావు సమక్షంలో గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీసా ఉపాధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన శివరామకృష్ణ, చిన్నిబాబులను పలువురు అభినందించారు. ఎస్‌ఐ బి.వెంకటేష్, ఉపాధి ఏపీవో ప్రకాష్, డిప్యూటీ ఎంపీడీవో నరసింగరావు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



ఎమ్మెల్యే మత్స్యలింగంను సన్మానిస్తున్న అరకులోయ మండల నాయకులు

అరకులోయటౌన్: ఈ ప్రాంత సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. గిరిజన సలహా మండలి సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనుల సమస్యలపై చర్చించే అవకాశం లేకుండా ఉండేదన్నారు. ఇప్పుడు గిరిజన సలహా మండలిలో పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుతోపాటు తనకు స్థానం కల్పించారన్నారు. దీంతో గిరిజన ప్రాంత సమస్యలపై చర్చించే అవకాశం లభించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మత్స్యలింగం తనయుడు చాణిక్య పుట్టిన రోజు వేడుకను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కమిడి అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు పల్లాసింగ్ విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, ఎంపీటీసీలు స్వాభి రామచందర్, మొర్డోస్ లలిత కుమారి, సర్పంచ్ పెట్టెలి సుస్మిత, సీనియర్ నాయకులు పట్టాసి సంపత్, నరసింహామూర్తి, నర్సింగ్, పాంగి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



కొండలరావు (ఫైల్)

డుంబ్రిగుడ: మండలంలోని కంద్రుమ పంచాయతీ జాకరవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పోరపు కొండలరావు అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి శెట్టి సుందరరావు, యూటీఎఫ్, పీఆర్టీయూ నాయకులు ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.

సెప్టిక్‌ట్యాంక్‌లో పడి ఆవు మృతి

మరో ఆవును ప్రాణాలతో బయటకు తీసిన స్థానికులు



ఆవును బయటకు తీసేందుకు శ్రమిస్తున్న యువకులు



ప్రాణాలతో బయటపడిన ఆవు

సీలేరు: స్థానిక ఏపీజెన్‌కో కార్మికుల కాలనీలో సెప్టిక్ ట్యాంక్ గోతిలో పడి ఓ ఆవు మృతి చెందగా, మరో ఆవును స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు. స్థానిక 7వ క్రాస్ రోడ్డు వెనుకవైపు నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు ఆ ప్రాంతానికి వెళ్లగా సెప్టిక్ ట్యాంక్‌లో రెండు ఆవులు పడిపోయి ఉండడాన్ని గుర్తించారు. సర్పంచ్ దుర్గో, జెన్‌కో ఫోర్‌మెన్ బుట్టి ఆధ్వర్యంలో యువకులు పొక్లెయిన్ సాయంతో మూడు గంటల పాటు శ్రమించి రెండు ఆవులను బయటకు తీశారు. వీటిలో మృతి చెందిన ఆవును అక్కడే ఖననం చేశారు. శ్రమించి ఆవులను బయటకు తీసిన యువకులను గ్రామపెద్దలు , స్థానికులు అభినందించారు.

ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు



భజన చేస్తున్న కళాకారులు

గంగవరం : స్థానిక హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన భజన బృందం కళాకారులతో భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు రాంబాబు, సిద్ధూ, రాజు, గిరిజన వర్తక సంస్థ డైరెక్టర్ కె.చిన్నారావు, భక్తులు పాల్గొన్నారు.

సూదివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : గర్భిణులు, బాలంతలు పౌష్టికాహారంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే అనుబంధ ఆహారాన్ని తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. మండలంలో సూదివలస గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 137 మందికి సాధారణ ఆరోగ్య పరీక్షలను చేయడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించుకోవడం వల్ల మాతాశిశు మరణాలు ఉండవని ఆమె తెలిపారు. పీహెచ్ఎన్ ప్రమీల, ఏఎన్ఎం అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ భూముల శిస్తుకు వేలం

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయ భూములు శిస్తులకు శుక్రవారం వేలం నిర్వహించారు. ఆలయ నిర్వహణ అధికారి దివ్యతేజ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా చుట్టుపక్కల రైతులు హాజరయ్యారు. ప్రస్తుతం 12 ఎకరాల భూములు శిస్తులకు వేలం నిర్వహించగా లింగంపేట గ్రామానికి చెందిన గోలకొండ చినసత్తిబాబు ఐదు ఎకరాలను రూ.24వేలకు దక్కించుకున్నారు. గతేడాది ఈ ఐదెకరాలు రూ. 29 వేలకు శిస్తుకు వెళ్లిందని, ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి, నిర్ణయం తీసుకుంటామని ఈవో తెలిపారు. మరో 7 ఎకరాలకు సంబంధించి వేలం పాటలో రైతులు ఎవరూ ఆసక్తి చూపలేదని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు



ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న రైతులను సత్కరిస్తున్న గణపర్తి వాసులు

మునగపాక: ప్రకృతి వ్యవసాయం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని సర్పంచ్ చదరం నాయుడు పేర్కొన్నారు. మండలంలోని గణపర్తిలో ప్రకృతి వ్యవసాయం చేపట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ ప్రణాళికను రైతులకు వివరించారు. భూసారానికి అనుగుణంగా పంటల సాగు చేపట్టాలన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలమన్నారు. కూరగాయల సాగు ద్వారా ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్న రైతులు కర్రి కన్నారావు, మల్లేశ్వరరావు, దార నాయుడు, దారబాబు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మారిశెట్టి రామలక్ష్మి, పెద్దలు కాళ్ల చంద్రమోహన్, ఆడారి కృష్ణవేణి, సాంబమూర్తి, పంచాయతీ కార్యదర్శి షణ్ముక్, యూనిట్ ఇన్‌చార్జి సతీష్, పద్మ, దేవి పాల్గొన్నారు.

ఫైబర్ నెట్ కోసం నిరసన



గెమ్మెలి సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ధర్మన్నపడాల్, గిరిజనులు

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి సచివాలయానికి ఫైబర్ నెట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ప్రజావసర పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, తక్షణమే ఫైబర్ నెట్ సదుపాయం కల్పించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్నపడాల్ డిమాండ్ చేశారు. గెమ్మెలిని శుక్రవారం ఆయన సందర్శించినప్పుడు వివిధ పనులపై వచ్చిన గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి సచివాలయం వద్ద ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ నెట్‌వర్క్ సమస్యే కారణంగా పనుల్లో అంతరాయం ఏర్పడుతుండడంతో పది కిలోమీటర్ల దూరం నుంచి వివిధ పనులపై సచివాలయానికి వస్తున్న ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని చెప్పారు. చాలా సార్లు సచివాలయానికి రావలసి వస్తోందని తెలిపారు. గెమ్మెలి సచివాలయంలో ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించి, గిరిజనులకు ప్రభుత్వ సేవలు సత్వరం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కులపాడు పీసా కమిటీ కార్యదర్శి ఈశ్వరరావు, సంపంగిపుట్టు పీసా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు,వివిధ గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై కౌమార బాలికలు శ్రద్ధ వహించాలి



వి.కొత్తూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

జి.మాడుగుల: కౌమార బాలికలు.. ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని, పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి,ఎస్.సత్యవతి, ఎం.లక్ష్మి తెలిపారు. మండలంలో చిన్నబంధవీధి,సింగర్బ సెక్టార్ పరిధిలో వి.కొత్తూరు,వనభరంగిపాడు,కొంతలం,చీకుంబంధ,జి.నిటాపుట్టు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోరి సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఆయా కేంద్రాల పరిధిలో గల 11-18సంవత్సరాల బాలికలకు బాల్యవివాహాలు, పోషకాహారం, లింగవివక్ష,ఆత్మరక్షణ,పోక్సోచట్టం, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వి.కొత్తూరులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు,హెల్పర్లు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులూ.. 'ఓపెన్'గా చదవండి



బాలికలకు సూచనలిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: వివిధ కారణాలతో మధ్యలో బడి మానేసిన డ్రాపౌట్ విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా కనీసం టెన్త్ క్లాస్ వరకూ అయినా చదవాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. కిశోర వికాసంలో భాగంగా శుక్రవారం ఆమె చిట్టింపాడు సచివాలయ పరిధిలో రామన్నపాలెం, మల్లవరం,డి.కొత్తూరులో కిశోర బాలికలతో సమావేశాలు నిర్వహించి, చదువు ప్రాముఖ్యతను వివరించారు. బడి మానేసిన పిల్లలను తల్లిదండ్రులు తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. లేదా ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పరీక్షలు రాయించాలన్నారు. అనంతరం ఆమె పిల్లలతో ఆటలు ఆడించారు.ఆర్‌ఐ రాజన్నదొర, మహిళా సంరక్షణ అధికారులు,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. కునుకూరులోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గేదెను ఢీకొన్న ఆటో

– డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి సమీపంలో రంగంపేట వైపు వెళుతున్న ఆటో గురువారం రాత్రి గేదెను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆటో దెబ్బతినగా , కాకినాడ జిల్లా రంగంపేట మండలం సుభద్రపేటకు చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ తీవ్రంగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన జడ్డంగి స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు క్షతగాత్రుడిని జడ్డంగి పీహెచ్‌సీకి తరలించి, ప్రథమ చికిత్స అందజేశారు. శ్రీనివాస్ ఈ ప్రాంతానికి బాడుగకు వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కాగా పశువుల కారణంగా ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపై పశువులు సంచరించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు



రోడ్డుపైకి వచ్చిన బండరాళ్లు



కందమామిడి వంతెన పక్కన ఏర్పడిన రంధ్రం

పాడేరు రూరల్: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వంతెనలు,రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఐనాడ పంచాయతీ తొలుగు గ్రామ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. బండరాళ్లు రోడ్డుపైకి దొర్లిరావడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ రాళ్లను తొలగించకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని స్థానికులు శుక్రవారం తెలిపారు. కందమామిడి సమీపంలో వంతెన పక్కన పెద్ద రంధ్రం ఏర్పడింది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదు. దీంతో స్థానికులు భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయించాలని పలువురు కోరారు.

చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం వద్దు



చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తొట్టెలను పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

మాకవరపాలెం: గ్రామాల్లో చెత్త తొలగింపుపై నిర్లక్ష్యం చేయొద్దని డీపీవో శిరీషారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని గిడుతూరు, బయ్యవరం, నారాయణరాజుపేట గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడి చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. వర్మీకంపోస్టు ఎరువు తయారీపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తాగునీటి క్లోరినేషన్‌తో పాటు వీధులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ అధికారులు పంపిణీ చేసిన బుట్టల్లోనే వేస్తూ పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చెత్త సంపద కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి నాగలక్ష్మి, డీఎల్‌పీవో మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.